బంగారు పిలక

శ్రీ చింతా దీక్షితులు

"తాతయ్యా, నా కోకథ చెప్పవూ?"

"బువ్వ తిన్నావా?"

"తిన్నా, తాతయ్యా"

"అయితే, ఏంకథ చెప్పమంటావు?"

"పిలకకథ తాతయ్యా"

"అయితే విను—

"అనగా అనగా ఒక ఊళ్లో ఒక బ్రాహ్మడుండే వాట్ట. ఆ బ్రాహ్మడికి బంగారుపిలక ఉండేదిట—"

"అదేమిటి తాతయ్యా, బంగారుపిలక లుంటాయా ఎవరికేనా?"

"అవునురా—చెప్పడం మరిచిపోయాను. వెనకటికాలంలో ఎవరి కేపిలక కావలిస్తే వాళ్లు ఆపిలక చేయించుకొనేవారట—"

"అదేమిటి తాతయ్యా—పిలకలు చేయించుకొంటారా ఎక్కడైనా?"

"ఆ కాలంలో చేయించుకొనేవారట–ఇప్పటికిమల్లె అప్పుడు పిలకలు తలకు అంటుకొని ఉండేవి కావట. ఎవరి పిలక వారు తీసుకొని మంచి మంచి నూనెలు రాసి దువ్వి జడలు వేసుకొని తలకు అంటించుకొనేవారట. కొందరు బంగారుపిలకలూ, కొందరు వెండివీ, కొందరు రాగివీ చేయించుకొనేవారట. ప్రతీరోజూ అవి తీసి తోముకొని మళ్లీ అందంగా తలకు తగిలించుకొనేవారట.

ఒకనాడు బ్రాహ్మడు అత్తారింటి కెళ్లాలని ముస్తాబై బంగారుపిలక అంటించుకొని వెడుతున్నాట్ట. తోవలో ఓఅడివి ఉంది. ఆఅడివిలోంచి వెడుతూంటే ఒకచోట ఓ గొర్రెలమందను కాసుకుంటూ ఒక గొల్లవాడు నిలబడ్డాడు. గొల్లవాడు పరధ్యానంగా ఉండడం చూచి ఒకనక్క గొర్రెపిల్ల నొకదాన్ని పట్టుకుపోవడానికి పొంచుండి చూస్తోంది. దాన్ని గొల్లాడు చూడ లేదు. బ్రాహ్మడు చూచి "గొల్లాడా గొల్లాడా! నీ గొర్రెపిల్లని పట్టుకుపోవాలని చూస్తోంది ఆ నక్క—చూశావా" అన్నాడు. గొల్లవాడు తిరిగిచూచి కర్ర పుచ్చుకొని నక్కమీదకు విసిరాడు. కర్ర నక్క కాలికి తగిలింది. అది పారిపోయింది. బ్రాహ్మడిమీద నక్కకు కోపం వచ్చింది. గొల్లాడితో చెప్పి తనకు గొర్రెపిల్ల లేకుండా చేశా డనిన్నీ, కర్రతో కొట్టించాడనిన్నీ కోపగించి బ్రాహ్మడిమీద కసితీర్చుకోవా లనుకొంది నక్క.

బ్రాహ్మడు అడివిలోంచి వెడుతున్నాడు. అతనికి కనిపించకుండా నక్క అతనివెనకే వెడుతోంది. ఇంతట్లో సాయంత్రం అయింది.

బ్రాహ్మడు సంధ్యవార్చుకోవా లనుకొన్నాడు. అక్కడో చెరు వుంటే ఆ చెరువులోకి దిగి సంధ్య వార్చుకోవచ్చును గదా అనుకొన్నాడు. అనుకొని, బంగారుపిలక ఒడ్డున పెట్టి, కాళ్లు కడుక్కోడానికి చెరువులోకి దిగాడు. దిగి, కాళ్లూ చేతులూ కడుక్కొని, పైకి వచ్చి, మళ్లీ పిలకపెట్టుకొని ఒడ్డున కూచుని సంధ్యవార్చుకోవచ్చుగదా అనుకొన్నాడు.

బ్రాహ్మడు కాళ్లు కడుక్కుంటూంటే నక్క మెల్లిగా వచ్చి బంగారుపిలక పట్టుకొని పారిపోయింది. బ్రాహ్మడు కాళ్లుకడుక్కొని పైకి వచ్చి చూచేసరికి పిలక లేదు.

"అన్నా! ఎంతపని జరిగింది. అత్తవారు పెట్టిన నిక్షేపంలాంటి పిలక పోయింది. ఇంక ఏమొహం పెట్టు

కొని అత్తవారింటికి వెళ్లను? ఎవరు తీసిఉంటారు నాపిలక? ఇక్కడ మనిషిసందడేనా లేదే?" అని అనుకొని బ్రాహ్మడు చుట్టుపట్లంతా వెతకడం మొదలు పెట్టాడు. ఎక్కడా పిలక చిక్కలేదు కాని చెరువు ఒడ్డుమీద తాను పిలకపెట్టినచోట నక్కకాలి అడుగులు ఉండడం చూచి "ఈనక్కగానీ పిలక పట్టుకు పోయి ఉంటుందా" అనుకొన్నాడు. గొర్రెపిల్లను పట్టుకుపోకుండా చేసినందుకు కోపంకొద్దీ ఆనక్క వచ్చి యింతపనీ చేసిఉంటుందని అతడు అనుకున్నాడు.

దాని కాలిఅడుగుల జాడనుబట్టి మెల్లిగా వెడుతున్నాడు. భూమిమీద కళ్లుపెట్టుకొని ఇటూ అటూ చూడకుండా వెడుతూంటే అతనికి ఒక చెట్లదుబ్బులో అలుకుడైన ట్లయింది. గాండ్రుగాండ్రుమని శబ్దము వినిపించింది. తటాలున ఆగాడు. ఆ దుబ్బులో నుంచి ఒక పెద్దపులి వచ్చి అతనికి ఎదురుగా నిలబడింది.

బ్రాహ్మడు గజగజ వణికిపోతున్నాడు. చేతులు జోడించి పెద్దపులికి దణ్ణం పెడుతూ అన్నాడుగదా "పులిరాజా పులిరాజా, నేను బ్రాహ్మణ్ణి; నన్ను వదిలిపెట్టు, నీ కెంతో పుణ్యం ఉంటుంది. నీవు ఈ అడవికి రాజువు. నీకు కావాలంటే ఎన్నిమృగములు లేవు, ఈ బ్రాహ్మడే కావాలా తినడానికి—నీకు పదివేల దణ్ణాలు. నన్ను వదిలిపెట్టు. నేను అత్తవారింటికి వెడుతూ బంగారుపిలక పోగొట్టుకొని దుఃఖిస్తున్నాను. పులిరాజుగారైన తమ దర్శనం దొరికినందుకు చాలా సంతోషిస్తున్నాను. తమ దర్శనఫలంగా నాపిలక నాకు దొరుకుతుందని నమ్మకం కలిగింది. నన్ను వదిలిపెట్టు" అని బ్రాహ్మడు సాష్టాంగపడ్డాడు. "ఇదేమి ఖర్మం, పిలకకోసం వెదుకుతూంటే పులినోట పడవలసి వచ్చింది" అనుకొన్నాడు. పెద్దపులి అతన్ని చూచి నవ్వి "లే, బ్రాహ్మడా, లే; నీపొగ డ్తలకు పొంగే రోజులు వెళ్లాయి. నే నెవర ననుకొన్నావు? నాకు ఆకలి లేదుకాని దాహం ఎక్కువగా ఉంది. నీ మెడదగ్గిరనరం నెమ్మదిగా కొరికి నీరక్తం తాగి దాహం తీర్చుకొని వెడతాను. తరవాత నీదారిని నీవు వెళ్లవచ్చు, లే" అంది.

"ధర్మమా, పులిరాజా, బ్రాహ్మడి రక్తం త్రాగడం? బ్రహ్మహత్యాదోషానికి ఒడిగడతావా ఇంతరాజ్యమూ ఏలుతూ?" అన్నాడు బ్రాహ్మడు.

"అయ్యో వెర్రి బ్రాహ్మడా, మా మనుష్యులకు మల్లె మాలో జాతి మత భేదాలు లేవు. నలుపు తెలుపు తేడాలు లేవు. మాకంటె కందరూ ఒక్కటే. కాబట్టి నీరక్తం తాగకమానను"

"అమ్మయ్యో! రక్షించు పులిరాజా" అన్నాడు బ్రాహ్మడు. పెద్దపులి కోపంతో బ్రాహ్మణ్ణి సమీపించి మెడ కొరకబోతూంటే అన్నాడుగదా బ్రాహ్మడు "ఆగు ఆగు, పులిరాజా, ఆగు ఆగు" అని.

"ఎందుకు, ఎందుకు" అంది పులి.

"ఒక ధర్మసూక్ష్మం ఉన్నది"

"ఏమి టది?"

"నేను చెప్పనూ చెప్పాను, నీవు చూడనూ చూచావు—నాకు పిలక లేదనే సంగతి. పిలకలేని బ్రాహ్మణ్ణిగాని, యితర కులస్థుణ్ణిగాని పులులు తినకూడ దని ధర్మశాస్త్రం ఉన్నది. అది నీవు మరిచి ఉంటావు. ఎట్లాగా నన్ను చంప నిశ్చయించావు కాబట్టి ఒక ఉపాయం చెప్పతాను విను"

"అవును, బ్రాహ్మడా, ఆమాట నిజమే. చెప్పు, ఆ ఉపాయం ఏమిటో"

"ఏమీ లేదు. నేను కాళ్లు కడుక్కుంటూంటే ఒక మాయనక్క వచ్చి నాబంగారుపిలక ఎత్తుకుపోయింది. మనం ఇద్దరమూ వెళ్లి దానివద్దనుండి పిలక పుచ్చుకొందాము. నే నాపిలక పెట్టుకొంటాను. తరవాత నారక్తంతో దాహం తీర్చుకొందువుగానినువ్వు" అన్నాడు బ్రాహ్మడు.

పులి సరే, పదమంది. పులీ, బ్రాహ్మణుడూ కలిసి అడివిలోంచి వెడుతున్నారు. ఎంత వెదకినా వాళ్లకు నక్క ఉండే జాడ కనిపించ లేదు. ప్రతీ కన్నమూ, ప్రతీపొదా మాస్తున్నారు. నక్క కనిపించ లేదు. పులికి దాహం ఎక్కువౌతోంది. బ్రాహ్మడికి భయం ఎక్కువౌతోంది.

చెట్టుకొమ్మమీదనుంచి వీళ్లను చూస్తూన్న ఒక కాకి అందికదా "పులిబావా పులిబావా, నువ్వూ, ఆబ్రాహ్మడూ కలిసి ఏమిటి వెతుకుతున్నారు" అని.

"ఈబ్రాహ్మడి పిలక నక్క ఎత్తుకుపోయిందిట. దానికోసం వెతుకుతున్నాము" అంది పులి.

"మనకు పగవాళ్లైన మనుష్యులతో స్నేహం చెయ్యవచ్చునా, పులిబావా" అంది కాకి.

"స్నేహం కాదమ్మా, కాకమ్మా! నాకు దాహం వేస్తోంది. ఈబ్రాహ్మడి రక్తం రవంత తాగి దప్పిక తీర్చుకొందా మనుకుంటే ఆ పాడుపిలక ఎక్కడో పారేసుకొన్నాట్ట, అది లేందే నేను మనుష్యులిని ముట్టుకోకూడదుకదా!"

"అలాగా? అయితే, నేచెబతా విను. ఇందాకా నేను ఆకాశంమీద షికారు తిరుగుతూంటే ఒకనక్క నోటితో పచ్చని వస్తువు ఒకటి కరుచుకొని పారిపోతోంది. దాన్ని నే నెరుగుదును."

"అయితే అది ఎక్కడ కాపరం?" అంది పులి.

"అదిగో, ఆ కనిపించే కొండదగ్గిర చెట్టు ఉంది. ఆచెట్టుకింద ఒక పెద్ద బండ ఉంది. ఆబండ కింద కన్నం ఉంది. ఆ కన్నంలో కాపురం నక్క" అంది కాకి.

"నీమేలు మరవనుసుమా" అంది పులి.

బ్రాహ్మడూ, పులీ కలిసి బండదగ్గిరికి వెళ్లారు. కాకికూడా వచ్చి చెట్టుమీద వాలింది.

బ్రాహ్మడికి గండం తప్పేటట్లు లేదు. ఎలాగ తప్పించుకోవడమా అని ఆలోచిస్తున్నాడు. ఇంతట్లోకే పులి అందికదా "అలా గుక్కిళ్లు మింగుతూ నిలబడతా వేమిటి బ్రాహ్మడా, పిలు, ఆనక్కను పిలు" అంది.

"నేను పిలిస్తే వస్తుందో రాదో, పులిరాజా! పిలక కోసం వచ్చిఉంటా నని అది తెలుసుకొని పలకదేమో నని భయం. మీరు పిలవమంటే పిలుస్తాను." అన్నాడు బ్రాహ్మడు.

"అయితే నువ్వు పిలవవద్దులే, నేనే పిలుస్తాను" అంది పెద్దపులి.

అప్పుడు కాకి అందికదా "పులిబావా పులిబావా, వద్దు వద్దు, నువ్వు పిలవకు. నువ్వుగానే పిలిస్తే భయపడి అసలే కన్నంలోంచి బయటికి రాదు" అని.

"అయితే ఏమిటి ఉపాయం" అంది పులి.

"ఉపాయానికి ఏముంది? నేనే పిలుస్తాను. కాని ఈబ్రాహ్మణ్ణి నువ్వూ, నక్కా తింటారుకదా, నాకేమిటి లాభం అనుకొంటున్నాను" అంది కాకి.

"నీకుకూడా ఒకభాగం పంచిపెడతాములే" అంది పులి.

కాకి సరేనని కన్నందగ్గిరబండమీద వాలి పిలవడం మొదలెట్టింది:

తలుపుతియ్యి తలుపుతియ్యి నక్కబావా
చుట్టాలు వచ్చారు నక్కబావా
కట్నాలు తెచ్చారు నక్కబావా
కడుపు నిండిస్తారు నక్కబావా

నక్క కన్నంలో ఉండి తనపిల్లాడికి జడవేసుకొంటోంది. జడవేసి బంగారుపిలక ఆపిల్లాడికి పెట్టాలని అనుకుంది. కాకిపిలుపు విని అందికదా—

చుట్టాలు ఎవరమ్మ కాకమ్మా
కట్నాలు ఏమిటమ్మ కాకమ్మా
చెయ్యూరుకోలేదు కాకమ్మా
జడ వేస్తున్నాను కాకమ్మా

అంటే కాకి అందిగదా—

చుట్టాలు నేనేను నక్కబావా
పక్కాలు నేనేను నక్కబావా
కట్నాలు యివిగోను నక్కబావా
కడుపునిండా తినవయ్యా నక్కబావా

అంటే, నక్క ముక్కుతో బయట ఎవరున్నారో అని వాసనచూడ్డం మొదలెట్టింది. మొదట మని

వాసన కొట్టింది. ఈమనిషి ఆబ్రాహ్మడేకదా, పిలక కోసం వచ్చిఉంటాడు అనుకొంది. తరవాత పెద్దపులి వాసన కొట్టింది. పెద్దపులితో చెప్పి దాన్ని తీసుకొని బ్రాహ్మడు పిలక నాదగ్గిర్నుంచి పుచ్చుకోడానికి వచ్చాడనుకొని కాకిమాటలు నమ్మరా దనుకొని అంది కదా —

చుట్టాలు వస్తేను కాకమ్మా
గుట్టమీద పీటవెయ్యి కాకమ్మా
చెట్టుమీద కూచోమను కాకమ్మా
జడ వేసి వస్తాను కాకమ్మా

అంటే, పెద్దపులి వచ్చి గుట్టమీద కూర్చుంది. బ్రాహ్మడు చెట్టు ఎక్కేడు. కాకి కన్నం దగ్గిర కూచుని చూస్తోంది.

ఎంతకీ నక్క బయటికి రాలేదు. పెద్దపులికి కోపంవచ్చిది. గాండ్రుగాండ్రుమంటూ అరుస్తూ అంది కదా— "నక్కా నక్కా, నీవు బయటికి వస్తావా రావా? నాకు దాహంగా ఉంది; నువ్వు రాకపోతే నిన్ను చంపేస్తాను. జాగ్రత్త"

అప్పుడు నక్క "ఎందు కంతకోపం పులిబావా! దాహంవేస్తే కాఫీ కాస్తున్నా, తెస్తా ఉండు. ఇంకా ఎవరున్నారు అక్కడ" అంది.

"నేనూ, బ్రాహ్మడూ, కాకీని — చప్పున బంగారుపిలక పట్టుకు బయటికి రా" అంది పులి.

అప్పుడు నక్క ఆలోచించి అనుకొందికదా "ఈ ముగ్గురూ పిలకకోసమే వచ్చారు. నన్ను చంపాలనే వీళ్ల ఉద్దేశం. ఈపిలక నాదగ్గిర ఉంటే ఎప్పటికైనా వీళ్లు నన్ను వదలిపెట్టరు. ఎందుకీపాడుపిలక నాకు? ఇక్కడ పారేసి పిల్లలతోకూడా పెరటిదారిని పారిపోతా" అని.

ఇట్లా అనుకొని నక్క పిలక అక్కడనే వదిలి పెట్టి వెళ్లి పోతూ ఇలా చెప్పింది—

వస్తూంటి వస్తూంటి పులిబావా
పళ్లుకొరికి ఎగరబోకు పులిబావా
పిల్లలకు జడవేసి పులిబావా
పళ్లూ కాఫీ తెస్తాను పులిబావా

కాకీ, పులీ చాలాసేపు కూర్చున్నారు అక్కడే. బ్రాహ్మడు చెట్టుచివరకొమ్మమీద కూర్చున్నాడు. ఎంతకూ రాకుంటే పులీ, కాకి మళ్లీ పిలిచారు. సమాధానం లేదు. నక్కమీద పులికి కోపం వచ్చి దాని కన్నం గోళ్లతో పెల్లగించి వేసింది. నక్క లేదు. మోసంచేసి పారిపోయిందిగదా అనుకొని ఇంకోమారు దానిపని పట్టవచ్చు ననుకొన్నది. కాకీ, పులీ కలిసి కన్నం అంతా వెదికితే బంగారుపిలక దొరికింది. కాకికీ, పులికీ సంతోషమైంది.

"దొరికింది, బ్రాహ్మడా, నీబంగారుపిలక! అదృష్ట వంతుడివి! పోతే పోయిందిలే వెధవనక్క—రా, దిగు— ఈపిలక పెట్టుకో– నాకు మరీ దాహంగా ఉంది— నాలిక పిడచకట్టుకుపోతోంది. చప్పున పిలక పెట్టుకో" అంది పులి.

బ్రాహ్మడికి సగంప్రాణం పోయింది. ఇలా అన్నాడు:

"నేరక ఈచిట్టచివరకొమ్మమీద కూర్చున్నాను. ఇప్పుడు ఎలాగ దిగడమో తెలియడం లేదు. నేను పిలకగానీ పెట్టుకుంటే దిగగలనేమో? పెద్దలు చెబ తారుగదా–పిలక సగం బలం అని. కాబట్టి కాకమ్మా! ఆపిలక రవంత యిట్లా తెచ్చిపెడితివా నీకు పుణ్యం ఉంటుంది. నే నాపిలక పెట్టుకొని నెమ్మదిగా చెట్టు దిగుతాను."

"దిగకపోతేనో" అంది కాకి.

"దిగక ఎక్కడికి పోతానమ్మా? భూమిమీద పులిరాజూ, ఆకాశంమీద నువ్వూ, మధ్య నేనూను – ఎక్కడికి పోతాను?"

కాకి ముక్కుతో పిలక తెచ్చి బ్రాహ్మడికి యివ్వబోతూంటే బ్రాహ్మడన్నాడు గదా "ఈరెండు చేతులతోనూ ఈ చెట్టుకొమ్మలు పట్టుకొన్నాను. పిలక ఎలాగ పెట్టుకోగలను? నువ్వే రవంత పెట్టి పెడుదూ" అని.

అంటే, కాకి బ్రాహ్మడి తలకు పిలక తగిలించింది. తగిలిస్తూంటే బ్రాహ్మడు తటాలున దాన్ని పట్టుకొని తన బట్టలో మూట గట్టి కింద పడవేశాడు. పిలక బాగా తగిలించుకొని కూర్చున్నాడు.

"అదేమిటి, బ్రాహ్మడా, ఆ కాకిని మూటగట్టి కింద పడవేశావు. నీవు మోసగాడివలె ఉన్నావే" అంది పులి.

"రామరామా! నేను మీపట్ల మోసం చేస్తానా? చేసి ఎక్కడికి వెళతాను? మీకు దాహం ఎక్కువగా ఉన్న దన్నారు గదా, నేను దిగేలోపుగా ఈ కాకి రక్తం కొంచెం పీల్చి దాహం తీర్చుకుంటారని పడవేశాను. ఇష్టం లేకుంటే మూట విప్పివెయ్యండి." అన్నాడు బ్రాహ్మడు.

"నీ రక్తం కావాలి నాకు, కాకిరక్తం కాదు" అంది పులి.

"అయితే దిగుతున్నా; కాని ఒకసందేహం మనస్సుని బాధిస్తోంది. ఇప్పుడు రెండుజాముల రాత్రి అయింది. పొద్దున్న పంచాంగం చూశాను. సరిగ్గా ఇది వర్జ్యసమయం. ఈవర్జ్యసమయంలో చెట్టు దిగడానికి కాళ్లూ చేతులూ ఆడ్డంలేదు. అంతేకాకుండా ఈ వర్జ్యసమయంలో మీరు నారక్తం తాగితే ఏం కడుపునొప్పి వచ్చి బాధపడతారో అని నాకు దిగులుగా ఉంది"

"అన్నా! ఎంతమోసగాడివి నీవు—ఉండు నీ సంగతి చూస్తాను. చిరతపులిని పిలిచి నిన్ను కిందకు లాగించకపోతే నాపేరు పెద్దపులి కాదు."

"ఎందుకు పులిరాజా! నామీద నీలాపనిందలు వేస్తారు—ఇక నాలుగుగడియలకు వర్జ్యం పోతుంది. పోయీపోవడంతోనే నేను చెట్టు దిగుతాను, తరవాత నారక్తం మీరు తాగవచ్చు"

"సరే, నే నీచెట్టుమొదటే కూర్చుంటాను. నీవు ఎక్కడికి పోతావో చూస్తానుగా" అంది పులి. చెట్టుమీద బ్రాహ్మడూ, చెట్టుకింద పులీ చాలాసేపు కూర్చున్నారు.

కొంతసేపైనతర్వాత అన్నాడుకదా బ్రాహ్మడు "ఏదో దూరాన్ని అలికి డౌతోంది పులిరాజా, వినిపిస్తోందా ?" అని.

"చెట్టుమీద ఉన్నావుకదా—అదేదో చూచి చెప్పు" అంది పులి. అప్పుడాబ్రాహ్మడు అన్నాడు—

మందలు మందలు జింకలమందలు
మందలు మందలు లేళ్లమందలు
పచ్చనివళ్లూ చుక్కలవళ్లూ
సన్నటికాళ్లూ గుండ్రనికళ్లూ
అన్నీ మందలు అవిగో మందలు
మందలు మందలు జింకలమందలు
మందలు మందలు లేళ్లమందలు
మందలు మందలు మందలు మందలు.

"ఎక్కడ, ఎక్కడ? ఆమంద లెక్కడ, బ్రాహ్మడా? సరిగ్గా చూచి చెప్పు" అంది పులి ఆశతో. బ్రాహ్మ డన్నాడుగదా—

కొండలదాపున సరస్సుదగ్గిర
లోయల్లోపల పొదలచాటునా
సూటికొమ్ములూ కొమ్మలకొమ్ములూ
పదునుగిట్టలూ నిండుపొట్టలూ
మందలుమందలు జింకలమందలు
మందలు మందలు లేళ్లమందలు
మందలు మందలు మందలు మందలు.

"నిజంగానేనా, బ్రాహ్మడా?" అంది పులి తొందరగా.

"నిజమేనయ్యా, ఎంత కన్నులపండుగ, ఎన్ని జింకలు, ఎన్ని జింకలు!

ఉత్సాహంతో ఉరుకుతున్నవి
గబగబ గబగబ గంతుతున్నవి
గిరగిర గిరగిర తిరుగుతున్నవి
చంగు చంగునా ఎగురుతున్నవి

తళతళ కళ్లు గిరగిర తిరగా
పచ్చిక కొంచెం కొరుకుతున్నవి
మేమే అంటూ అరుస్తున్నవి
సరస్సు నీళ్లు తాగుతున్నవి
మందలు మందలు జింకలమందలు
మందలు మందలు లేళ్ల మందలు
వేలూ లక్షలు కోట్లు మందలు
మందలుమందలు మందలుమందలు.

బ్రాహ్మడు పాడుతూంటే పులికి నోరూరుతోంది. ముక్కుతో వాసనచూచింది. కొంచెం జింకల వాసన కొట్టినట్లయింది. చెవులు నిక్కించి విన్నది. కొంచెం అలుకుడుకూడా వినిపించినట్లయింది.

బ్రాహ్మడు మళ్లీ—

ఆకాశంలో చుక్కల మిలమిల
కొండదాపులో జింకల మిలమిల
అడివి అంతటా జింకల కలకల
దుబ్బుల్లోనూ చెట్లపక్కనా
బండలమధ్యా సరస్సుదరినీ
మైదానంలో చరియల్లోనూ
కిందా మీదా ముందూ వెనకా
జోరా మందలు జింకలమందలు
ఆడజింకలూ పిల్లజింకలూ
పొడలజింకలూ పొట్టిజింకలూ
మందలుమందలు జింకలమందలు
మందలుమందలు లేళ్లమందలు
మందలుమందలు మందలుమందలు.

పెద్దపులి బ్రాహ్మడు పాడిన పాట విని చెట్టుకింద ఉండలేకపోయింది. రంయిన బయలు దేరి ఉరకుతూ కొండలకేసి పరుగెత్తుకుపోతూంటే బ్రాహ్మడు గట్టిగా —

మందలుమందలు జింకలమందలు
మందలుమందలు లేళ్లమందలు
ఒకటా రెండా మూడా నాల్గా
వందలు వేలు లక్షలు కోట్లు
కొండలచుట్టూ కెరటాలా అవి
సుడిగుండాలా సముద్రంపోటా
మందలుమందలు జింకలమందలు
మందలుమందలు లేళ్లమందలు
మందలుమందలు మందలుమందలు.

అని పాడుతూనే ఉన్నాడు. పెద్దపులి మాయమయింది.

తెల్లవారింది. జాముపొద్దెక్కేదాకా బ్రాహ్మడు చెట్టుమీదే కూర్చుని, తరవాత చెట్టుదిగి, మూట విప్పి కాకిని వదిలిపెట్టి, కండువా తీసికొని, బంగారుపిలక సరిగ్గా ఉందో లేదో చూచుకొని అత్తారింటికి నడిచిపోయాడు."

* * *

"అయిందా, తాతయ్యా, కథ?"

"అయిందిరా, ఇంక పడుకో."

"మరి పెద్దపులి ఏమయింది?"

"జింకల్ని వేటాడి కడుపునిండాక తన గుహలో నిద్రపోడానికి పోయింది."

"బ్రాహ్మడున్న చెట్టుదగ్గిరికి రాలేదూ?"

"పగటివేళ పులులు తిరగవు. వాటికి నిద్ర వస్తుంది. గుహలోకి పోయి నిద్రపోతాయి"

కథ కంచికి వెళ్లింది. తాతయ్యపక్కలో అబ్బాయి నిద్రపోయాడు.